మోతీనగర్ ప్రధాన రహదారి హనుమాన్ దేవాలయం సమీపంలో పొంగిపొర్లుతున్న మురుగు





# మురుగు పారుతున్నా పట్టించుకోరా?

- మోతీనగర్ ప్రధాన రోడ్డులో నిత్యం పారుతున్న మురుగు
- సమస్యను పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

**మోతీనగర్:** మోతీనగర్ ప్రధాన రోడ్డులోని హనుమాన్ దేవాలయం సమీపంలో నాలుగు కూడళ్ల మధ్య కొన్ని రోజుల నుంచి డ్రైనేజీ పొంగిపొర్లడంతో మురుగు ప్రవహిస్తూ మోతీనగర్ కమ్యూనిటీహాల్ వరకు పారుతోంది. ఈ రోడ్డు ఎర్రగడ్డ శ్రీరామ్‌నగర్, భరత్‌నగర్‌లతో పాటు పలు బస్తీలకు వెళ్లాల్సిన ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు సమస్యను తెలిపినా పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు వాపోతున్నారు. సమీపంలోనే దేవాలయం, ఆస్పత్రి, వ్యాపార సముదాయలు ఉండటంతో ఎప్పుడు ఆ రోడ్డు జనసంచారంతో రద్దీగా ఉంటుంది. దుర్గంధం, దుర్వాసనతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పొంగుతున్న డ్రైనేజీకి శాశ్వత మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# మొగులమ్మ బస్తీ సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

**ఆల్విన్‌కాలనీ:** డివిజన్ పరిధిలోని మొగులమ్మ బస్తీలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గురువారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని బస్తీవాసులు కలిసి మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బస్తీవాసులు మాట్లాడుతూ... మొగులమ్మ బస్తీలో గత కొన్ని రోజులుగా మంచినీటి సమస్య ఉందన్నారు. తక్కువ ప్రెషర్‌తో తాగునీరు వదులుతున్నారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలను తీసుకోవాలన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని సూచించారు. అదే విధంగా కాలనీలో నెలకొన్న పలు సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని తెలిపారు. కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మొగులమ్మ కాలనీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. త్వరలో కాలనీలో పరిష్కరించి ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. అదే విధంగా కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకుడు జాన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



సీఐటీయూ జెండా ఎగురవేస్తున్నభవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

**ఆల్విన్‌కాలనీ:** సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కూకట్‌పల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం అడ్డాలో సీఐటీయూ జెండాను గురువారం ఆవిష్కరించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం కూకట్‌పల్లి మండల అధ్యక్షులు బి. రాములు మాట్లాడుతూ... ఐక్యత పోరాటమనే నినాదంతో 1970 మే 30న సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలకు, వారి హక్కుల కోసం నిరంతరం వారి వెంట నిలబడి పోరాటం చేస్తుందన్నారు. అసంఘటిత కార్మికుల కనీస వేతనాలు, హక్కులు అములు చేయలేదన్నారు. పెరిగిన ధరల అనుగుణంగా కార్మికులకు కనీసం వేతనం రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రజా పంపిణీ వ్యవస్థను ధ్వంసం చేసిందని.. తొమ్మిది రకాలు నిత్యావసరాల ఇవ్వకుండా కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారని తెలిపారు.

◆ 44 కేంద్ర కార్మిక చట్టాల్లో 29 చట్టాలు రద్దు చేసిందని తెలిపారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని ఆరోపించారు. అంగన్‌వాడీ మధ్యాహ్న భోజనం, ఉపాధి హామీ, నేషనల్ హెల్త్ మిషన్, సర్వ శిక్ష అభియాన్ రంగాలకు కేంద్ర బడ్జెట్‌లో కోతలు విధించిందని తెలిపారు. ఫలితంగా రాష్ట్రలోని అంగన్‌వాడీ, ఆశావర్కర్, ఏఎన్‌ఎం, మధ్యాహ్న భోజన కార్మికులు ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఐకేపీ వీవోఏ తదితరులను కార్మికులుగా గుర్తించటం లేదన్నారు. అదే విధంగా ప్రమాదకరమైన మోటార్ వాహన చట్టానికి సవరణ చట్టం చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రమేష్ లాజర్, రాజు, శ్రీను, శ్రీశైలం, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

- కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్
- వాణిజ్య సంస్థలు పార్కింగ్ సదుపాయం కల్పించుకోవాలని ట్రాఫిక్ పోలీసుల సూచన
- నియంత్రణపై అధికారుల దృష్టి



కేపీహెచ్‌బీలో ట్రాఫిక్ జామ్

**ఆల్విన్‌కాలనీ:** ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలను పరిశీలించి ఆయా ప్రాంతాల్లో, మూల మలుపుల్లో, విరివిగా ట్రాఫిక్ జామ్ అయ్యే కూడళ్లల్లో నియంత్రణకు చర్యలు చేపట్టారు. నో పార్కింగ్ జోన్‌లో వాహనాలను పార్కు చేయొద్దన్నారు. లేకుంటే చలానాలు విధించాల్సి వస్తుందని హెచ్చరించారు.

◆ కూకట్‌పల్లి ముంబాయి జాతీయ రహదారిలోని మెట్రో పిల్లర్స్ యూ-టర్న్‌లు, భాగ్యనగర్‌కాలనీ మెట్రోస్టేషన్, ఉషా ముళ్లపూడి రోడ్డు, వివేకానందనగర్ చౌరస్తా, కూకట్‌పల్లి బస్టాప్, ఎన్‌కెఎన్‌ఆర్ గార్డెన్ యూటర్న్, వై జంక్షన్, జేఎన్‌టీయూ చౌరస్తాలలో ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ ఉన్నతాధికారులు సిమెంట్, ఐరన్ బారికేడ్‌లను ఏర్పాటు చేశారు.

◆ రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో పార్కింగ్ చేసే వారికి జరిమానా విధిస్తామని అధికారులు పేర్కొన్నారు. కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో వాహనాల రద్దీ పెరగటం.. రోడ్ల విస్తరణ లేక ఎక్కడికక్కడ ట్రాఫిక్ ఆగిపోతోంది. ఇక సర్వీస్ రోడ్లలో కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయకుండా ఆయా వ్యాపార సముదాయాల నిర్వాహకులు పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని ట్రాఫిక్ అధికారులు సూచించారు.



భాగ్యనగర్‌కాలనీ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్న పోలీసులు

## ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు



ప్రధాన కూడళ్లపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు ట్రాఫిక్ లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే జీహెచ్‌ఎంసీ అధికారులకు యూ-టర్న్‌లు, డివైడర్స్, జీబ్రా లైన్లు వంటి వాటి మార్పులు చేర్పుల కోసం వారి దృష్టికి తీసుకెళ్లాం. కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో ట్రాఫిక్ సజావుగా సాగేలా కృషి చేస్తున్నాం.

-కె. శ్రీనివాసులు, కూకట్‌పల్లి ట్రాఫిక్ సీఐ

## ముగిసిన శంకరమఠం వార్షికోత్సవాలు



**మోతీనగర్:** మూసాపేట డివిజన్ మోతీనగర్ శ్రీ శృంగేరి శారద శంకరమఠంలో ఐదు రోజులుగా జరుగుతున్న 25వ వార్షికోత్సవాలు గురువారం ముగిసాయి. ముగింపు సందర్భంగా గురువందనం మూలవిరాట్టుకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శారదమాతాకు మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం శారద అమ్మవారి నగర ఉత్సవం, పల్లకీ సేవ నిర్వహించారు.

## భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



**మోతీనగర్:** కబీర్‌నగర్‌లోని శివరామాంజనేయ ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా గురువారం కుంభ స్థాపన, సుదర్శన హోమం నిర్వహించారు. గోవిందా గోవిందా నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ వేడుకలు జూన్ 1 వరకు కొనసాగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

# నూతన ఆవిష్కరణల దిశగా ముందుకెళ్లాలి

జీవశాస్త్ర పరిశోధనల్లో కృత్రిమ మేధ సదస్సులో జేఎన్‌టీయూ బ్రిక్స్ డైరెక్టర్లు



జేఎన్‌టీయూహెచ్‌లో జరిగిన సదస్సును ప్రారంభిస్తున్న బ్రిక్స్ డైరెక్టర్లు, ప్రొఫెసర్లు

**బాలానగర్:** బయోటెక్నాలజీ విభాగంలోని 'జీవశాస్త్ర పరిశోధనల్లో కృత్రిమ మేధ'అనే అంశంపై గురువారం జేఎన్‌టీయూహెచ్‌లో జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సును ప్రొ. వెంకటరామరెడ్డి ఉద్యోగ విరమణను పురస్కరించుకొని నిర్వహించారు. ఈ సదస్సులో జేఎన్‌టీయూ బ్రిక్స్ డైరెక్టర్లు ప్రొ. వెంకటేశ్వరరెడ్డి, కన్వీనర్‌గా డా. సైదానాయక్, డిప్యూటీ డైరెక్టర్ కో-కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ సదస్సుకు జేఎన్‌టీయూ రెక్టార్ ప్రొ. విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొ.వెంకటేశ్వరరావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. వెంకట నరసింహారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

◆ సదస్సును ఉద్దేశించి వక్తలు జంపాల, డా. పెరుగు శ్యామ్, ప్రొ. కరుణలు ప్రసంగించారు. పీజీ, పరిశోధక విద్యార్థులు కృతిమ మేధస్సును ఉపయోగించి జీవశాస్త్రంలో నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలన్నారు. రాబోయే కాలంలో నూతన అవకాశాలను అందిపుచ్చుకోవాలని తెలిపారు.

◆ ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ పొందిన ప్రొ. వెంకటరామిరెడ్డి ఉత్తమ ప్రొఫెసర్ అని కొనియాడారు. మృద స్వభావి, అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి అని తెలిపారు. ఈ సందస్సుకు వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు ఫార్మా బయోటెక్ పరిశ్రమల నుంచి పరిశోధకులు హాజరయ్యారు.

# సాహిత్య అకాడమీకి చైర్మన్‌ను నియమించాలి

**లిబర్టీ:** తెలంగాణ సాహిత్య అకాడమీకి పాలక మండలి నియమించాలని అభ్యుదయ రచయితల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్. సూర్యప్రకాష్, ప్రధాన కార్యదర్శి గడ్డమీది చంద్ర మోహన్‌గౌడ్, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సాహిత్య అకాడమీకి పాలకమండలి లేనందున సాహితీ కార్యకలాపాలు నిర్వహించడం లేదన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరుణంలో సాహిత్య అకాడమీకి చైర్మన్‌ను సభ్యులను నియమించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

# 'ఐలా ల్యాండ్‌వాల్'తో రాకపోకలకు అంతరాయం



**బాలానగర్:** ఫతేనగర్ డివిజన్ శివాలయం బస్తీని ఆనుకొని ఉన్న 'ఐలా ల్యాండ్‌వాల్' రాకపోకలకు అంతరాయం కలుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఎమ్మెల్యే గురువారం ఫతేనగర్ కార్పొరేటర్ సతీష్‌గౌడ్‌తో కలసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు 'ఐలా ల్యాండ్ వాల్'స్థలం బస్తీ కమ్యూనిటీహాల్‌కు కేటాయించాలని కోరారు. జోనల్ కమిషనర్‌తో మాట్లాడి స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కురమయ్య, ఎర్ర నరసయ్య, డేవిడ్, సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఉపకులపతుల ఎంపిక నిష్పక్షపాతంగా జరగాలి

- జేఎన్‌టీయూ ప్రొటెక్షన్ ఫోర్స్
- ఎస్‌వీ కోటారెడ్డిని జేఎన్‌టీయూ వీసీగా ఒప్పుకోమని నిరసన
- విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని కాపాడాలని డిమాండ్



జేఎన్‌టీయూహెచ్‌లో పోస్టు కార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న యూనివర్సిటీ ప్రొటెక్షన్ ఫోర్స్ సభ్యులు, విద్యార్థులు

**బాలానగర్:** మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మిత్రుడు వీఐటీ-ఏపీ ఉపకులపతి డా. ఎస్‌వీ కోటారెడ్డిని జేఎన్‌టీయూ ఉపకులపతిగా ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోమని జేఎన్‌టీయూ ప్రొటెక్షన్ ఫోర్స్, విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోస్టు కార్డులను ముఖ్యమంత్రి, గవర్నర్‌లకు పంపించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు రాహుల్ నాయక్, జవ్వాజి దిలీప్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాల ఎంపిక ప్రక్రియలో రాజకీయ నాయకుల జోక్యం తగ్గించాలన్నారు. విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ప్రభుత్వ యూనివర్సిటీల ప్రొఫెసర్లు కనిపించడం లేదా?

◆ ఉప కులపతుల ఎంపికలో ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో పనిచేసే వ్యక్తులను పరిశీలనకు తీసుకోవడం దారుణమన్నారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పనిచేసే అధ్యాపకుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయటమేనని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పనిచేసే అధ్యాపకులలో అర్హులైన ప్రొఫెసర్లు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

### మంత్రి పరిచయాలు విశ్వవిద్యాలయాల అభివృద్ధికి ఉపయోగపడాలి..

◆ ఎప్పుడు ప్రభుత్వం నిర్వహించే అర్హత పరీక్షను సైతం ఎదుర్కోలేని డా. ఎస్‌వీ కోటారెడ్డిని ఏ విధంగా జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా అర్హుడవుతాడని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తన పరిచయాలను విశ్వవిద్యాలయాల అభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలన్నారు.

### స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం...

◆ వెంటనే డా. ఎస్‌వీ కోటారెడ్డి అప్లికేషన్‌ను తొలగించి నిష్పక్షపాతంగా వీసీల ఎంపిక ప్రక్రియ కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాయిచరణ్, రాకేష్, చంద్రశేఖర్, సిద్ధార్థ, సృజయ్, బ్రహ్మం, వంశీకృష్ణ, విశ్వ తేజ, అనీష్, శివ కృష్ణ, వర్షిత్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త వేసే ప్రాంతాన్ని శుభ్రం చేసి స్థానికులతో కలిసి మొక్కను నాటిన జీహెచ్‌ఎంసీ అధికారులు




## చాయ్ ఫర్ సఫాయి

**మూసాపేట:** వడ్డెరబస్తీ కమ్యూనిటీహాల్ జీవీపీ వద్ద గురువారం ప్రాజెక్టు ఆఫీసర్ ఎల్. ఇంద్రసేనా ఆధ్వర్యంలో 'చాయ్ ఫర్ సఫాయి'కార్యక్రమాన్ని నిర్వహించారు. కమ్యూనిటీహాల్ వద్ద మళ్లీ చెత్త వేయకుండా ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా అక్కడ స్థానికులతో కలిసి చాయ్ తాగుతూ.. చెస్ ఆడుతూ.. ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వారితో కలిసి ఆ ప్రాంతంలో మొక్కలు నాటారు. చెత్తను బహిరంగ ప్రదేశంలో చెత్త వేయొద్దని ప్రజల్లో చైతన్యం కల్పించే విధంగా ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ కె. మురళి, సమాఖ్య సభ్యులు అనిత, లక్ష్మి, హేమలత, మీనా, ఆర్‌పీలు భాగ్యశ్రీ, మాధవి, స్వప్న, అశ్విని, గాయత్రి, శ్రావణి, మాలశ్రీ, ఊర్మిళ, సరిత, సుజాత, రాజేశ్వరి, యాదమ్మ, చందన, జ్యోతి, శానిటేషన్ వర్కర్ల దయాళ్ సింగ్, స్వామి పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

**మూసాపేట:** ఆంజనేయనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు. ఆంజనేయనగర్ రోడ్ నం .5-8 వరకు, కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం, మూసాపేట ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు..

◆ మూసాపేట హనుమాన్ జంక్షన్, మూసాపేట నరసింహస్వామి ఆలయం, జనతానగర్, యాదవబస్తీ, మూసాపేట ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

## 'మనూ' ఐటీఐలో అడ్మిషన్లు ప్రారంభం

- దరఖాస్తుల సమర్పణకు జూన్ 7 చివరి తేదీ
- 'మనూ'ఐటీఐ ప్రిన్సిపాల్ డాక్టర్ అర్షియా ఆజమ్

**రాయదుర్గం:** మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఐటీఐ కోర్సులో అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించినట్లు 'మనూ' ఐటీఐ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్ గురువారం తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో ఈ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఉర్దూ భాష లేదా ఉర్దూ మాధ్యమం ద్వారా ఎస్‌ఎస్‌సీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అవకాశం కల్పిస్తామన్నారు. డ్రాఫ్ట్స్‌మన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, రిఫ్రిజిరేటర్ అండ్ ఎయిర్ కండీషనింగ్, ప్లంబింగ్ వంటి అయిదు ట్రేడ్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. మరింత సమాచారం కోసం 040-23008428, 9440692452లో సంప్రదించాలని కోరారు. ఇదిలావుండగా బెంగళూరు ఐటీఐలో దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ జూన్ 3గా నిర్ణయించామన్నారు. బెంగళూరు ఐటీఐ వివరాల కోసం 080-29742261లో సంప్రదించాలన్నారు.

## మర్యాదపూర్వక కలయిక



సునీతామహేందర్‌రెడ్డిని కలిసిన సుంకన్న, కాంగ్రెస్ నేతలు

**మోతీనగర్:** పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ 14 సీట్లు గెలవడం ఖాయమని పార్టీ సీనియర్ నాయకుడు సి. సుంకన్న అన్నారు. గురువారం మల్కాజ్‌గిరి అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిని ఆయన స్థానిక నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన విజయానికి కృషి చేసిన ప్రతి కార్యకర్త, నాయకుడికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. రాబోయే రోజుల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా మార్చేందుకు పని చేయాలన్నారు. రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీదే విజయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్. నరసింహయాదవ్, కొండం ఆదిరెడ్డి, వెంకటేశ్వరరావు, శేఖర్, అమ్ములమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై చెత్త వేయకుండా అవగాహన పెంచాలి

సమీక్ష సమావేశంలో జెడ్‌సీ అభిలాష అభినవ్



కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న అధికారులు

**కూకట్‌పల్లి:** చెత్త డంపింగ్ ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ అన్నారు. ఇంజినీరింగ్ అధికారులు, డీసీలు, టౌన్‌ప్లానింగ్ అధికారులతో గురువారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నాలాల్లో చెత్త వేయకుండా సిబ్బందిని నియమించి నిరోధించాలన్నారు. చెత్తను తరలించేందుకు అవసరమైతే మరిన్ని వాహనాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కాలుష్య కారకాలైన వాణిజ్య, పారిశ్రామిక సంస్థలకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. తప్పదు అనుకుంటే వారిపై చర్యలు కూడా తీసుకోవాలన్నారు. నాలాల శుభ్రత కోసం ఆధునిక పరికరాలను ఉపయోగించుకోవాలని సూచించారు.

## అందంగా ఉండే ప్రతి ఒక్కరూ సెలబ్రిటీయే..



అడ్వాన్స్‌డ్ గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రావు, శరణ్‌వేల్

**కూకట్‌పల్లి:** కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నం.1లో అడ్వాన్స్‌డ్ గ్రో హెయిర్ అండ్ గ్లో స్కిన్ 7వ క్లినిక్‌ను గురువారం సంస్థ ఫౌండర్ శరణ్‌వేల్, విజేత సూపర్ మార్కెట్ ఎండీ జగన్‌మోహన్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం. జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ... అందం మరింత ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తుందని అన్నారు.అందంగా ఉండే ప్రతి ఒక్కరూ సెలబ్రిటీయే అని అన్నారు. చెన్నై ఆధారిత సంస్థ గ్రో హెయిర్ అత్యాధునిక చికిత్సలు ఇక్కడ అందుబాటులోకి తీసుకురావటం అభినందనీయమన్నారు. సంస్థ ఎండీ శరణ్‌వేల్ మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా 60కి పైగా క్లినిక్‌లు ఉన్నాయని డిసెంబర్ నాటికి 100 క్లినిక్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఫ్రాంచైజీ భాగస్వామి రాగిని అరవిందన్ మాట్లాడుతూ.. క్లినికల్, నాన్-క్లినికల్ చికిత్సలతో జుట్టు తిరిగి పెరగడం కోసం యుఎస్-ఎఫ్‌డీఏ ఆమోదించిన అధునాతన సేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు.

## కార్మికులకు ఉచిత వైద్యం అందించాలి

**లక్డీకాపూల్:** కార్మికులకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం రిటైర్ అయిన కార్మికులకు ఉచిత వైద్యం అందించాలని నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎం.వెంకటేష్ కోరారు. గురువారం నిమ్స్‌లో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ... కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు.